# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక


సంపుటి : -13 సంచిక : 150 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

15-04-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


# తరాలు మారినా చెదరని స్ఫూర్తి అంబేద్కర్

- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- జయంతి సందర్భంగా నివాళులు అర్పించి మహనీయుని స్ఫూర్తితో పనిచేద్దామని పిలుపు



**నవతరం-శ్రీకాకుళం**

బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని క్యాంప్ కార్యాలయంలో నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన దేశానికి రాజ్యాంగాన్ని రచించి సుమారుగా 80 సంవత్సరాలు కావొస్తుంది. ప్రపంచంలో అనేక దేశాలకు రాజ్యాంగాలు ఏర్పాటు కాగలిగాయి. ప్రపంచంలో వివిధ దేశాలకు ఉన్న రాజ్యాంగాల సరాసరి వయసు 19 సంవత్సరాలు మాత్రమే. అంటే ఎప్పటికప్పుడు ఆ..రాజ్యాంగాలు విఫలం అయిపోతున్నాయి. ప్రజాస్వామ్యంలో విఫలం అంటే ప్రజల్లో రాజ్యాంగం మార్చాలి అనే ఆలోచన రావడమే. ఆ..దేశ పరిపాలనకు ఆ..రాజ్యాంగం పనికిరాదని ఆలోచనకు రావడం. కానీ భారతదేశంలో వచ్చిన రాజ్యాంగం 80 సంవత్సరాలు గడిచినా చెక్కుచెదరకుండా ఎప్పటికైనా ఇదే మార్గమని పౌరులందరూ పాటించే గొప్ప రాజ్యాంగం భారతదేశానిది. ఆ..రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ అని మనవి చేస్తున్నాను. భారతదేశ సమ సమాజం -మిగతా 2లో

# అక్రిడేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలి

మంత్రి అచ్చెంనాయుడు ఆదేశాలు 2లో



# రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు మనం ఇచ్చే గౌరవం

పలాస- కాశీబుగ్గ పురపాలక సంఘం మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు



**నవతరం -పలాస**

లౌకిక రాజ్యాంగ పరిరక్షణే బాబాసాహెబ్ అంబేద్కర్ కు మనం ఇచ్చే ఘనమైన గౌరవం అని పలాస- కాశీబుగ్గ పురపాలక సంఘం మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక కాశీబుగ్గ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలలుగన్న సామాజిక న్యాయం ఫెడరలిజం, లౌకిక తత్వం సాధనకు మనమంతా పాటుపడాలని గిరిబాబు కోరారు. ప్రపంచ మేధావుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన అంబేద్కర్ భారత రాజ్యాంగ రచన కమిటీ సారధిగా గొప్ప రాజ్యాంగాన్ని అందించారని అన్నారు. దేశంలో కుల వ్యవస్థకు ప్రధాన కారణమైన మనువాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి మనుధర్మ శాస్త్రాన్ని తగలబెట్టారని అన్నారు. భారతదేశ మత రాజ్యాంగంగా మారకూడదని, ఈ దేశంలో హిందూ ముస్లిం క్రైస్తవ బుద్ధిజం జైన పారశీక తదితర మతస్థులు సోదర భావంతో మెలగాలని , లౌకిక దేశంగా ఉండాలని అంబేద్కర్ కలలు కన్నారని అన్నారు. అంబేద్కర్ ఒక మతానికో, కులానికో చెందిన వ్యక్తి కాదని, ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మేధావి, మహనీయుడనిఅన్నారు. బాల్యం నుండే కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పట్టుదలతో ముందుకు సాగిన యోధుడని అన్నారు. లండన్ యూనివర్సిటీలో ఎక్కువ కాలం గడిపి ఎక్కువ పుస్తకాలు చదివిన ఒకరిద్దరలో అంబేద్కర్ ఒకరన్నారు. అంబేద్కర్ ఆలోచనలే వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. మంత్రివర్గ విస్తరణ నుంచి క్షేత్రస్థాయిలో వివిధ పదవులు నియామకంలో మహిళలతోపాటు, బడుగు, బలహీన వర్గాలకు పెద్ద ఎత్తున రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించారని బల్ల గిరిబాబు గుర్తు చేశారు. నేటి యువత అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు మీసాల సురేష్ బాబు, వేణు, వల్లభ వైకుంఠరావు, మరడ భాస్కర్ రెడ్డి, బడగల మధు, పలువురు వైసిపి కార్యకర్తలు, దళిత సంఘ నేతలు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ చైతన్య రథం ప్రారంభం



- జెండా ఊపి ప్రారంభించిన అధికారులు
- వారం రోజుల పాటు గ్రామాల్లో ప్రచారం
- అంబేడ్కర్ సిద్ధాంతాల విస్తరణ లక్ష్యం
- మాజిక నేతల పాల్గొనింపు

**నవతరం-శ్రీకాకుళం**

జాతీయ రెళ్ళి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చైతన్య రథాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా. జి. నారాయణరావు ప్రారంభించారు. వారం రోజుల పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఈ రథం తిరిగి అంబేడ్కర్ సిద్ధాంతాలు, సామాజిక చైతన్యం గురించి ప్రచారం చేయనుంది. అంబేడ్కర్ కులనిర్మూలనకు మార్గదర్శకుడని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని పలువురు నేతలు పేర్కొన్నారు.

కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, సామాజిక నేతలు పాల్గొన్నారు.

# భీమ్‌రావ్ రామ్‌జీ సక్పాల్ ఆశయాలను కొనసాగిద్దాం

బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. పైడి. సింధూర



**నవతరం-శ్రీకాకుళం**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అందరం కొనసాగిద్దామని, బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు డా.పైడి.సింధూర అన్నారు. స్థానిక శాంతి నగర్ గాంధీజి స్మారక నిలయంలో, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగముగా బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు డా.పైడి.సింధూర పాల్గొని, పూలమాలతో అంజలి ఘటించి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతని, సంఘ సంస్కర్త, ప్రముఖ న్యాయవాది. దళితుల హక్కులు, కుల నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం పోరాడిన యోధుడన్నారు. ఆయన, స్వతంత్ర భారతదేశపు మొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని, రాజ్యాంగ సభ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని గుర్తుచేశారు. అస్పృశ్యత, కుల వ్యవస్థపై పోరాడి, దళితుల విద్య, ఉపాధి కోసం 'బహిష్కృత హితకారిణి సభ'ను స్థాపించారని, కొలంబియా యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో డిగ్రీలు సాధించి, 1956లో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి, సమతావాదాన్ని ప్రచారం చేశారన్నారు. బావితర యువత, డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను తెలుసుకోవాలని, ఆయన జీవిత చరిత్రను పరిశీలిస్తే, ఆయన రాజ్యాంగమేమితో అర్ధమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా సభ్యులు జివిస్ సురవరం. పద్మ, కీర్తన, తదితరులు పాల్గొన్నారు.

# అరసవిల్లిలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా



- అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలు
- పెద్దలకు సత్కారం కార్యక్రమం
- 500 మందికి అన్నసంతర్పణ
- ప్రముఖుల పాల్గొనింపు

**నవతరం-శ్రీకాకుళం**

అరసవిల్లి హరిజన వీధిలో భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 135వ జయంతి వేడుకలు అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పెద్దలను కమిటీ సభ్యులు సత్కరించి వారి అనుభవం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జయంతి వేడుకలు ఇలాగే ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం సుమారు 500 మందికి అన్నసంతర్పణ నిర్వహించారు.

వేడుకల్లో భైరి రామకృష్ణ, కొప్పాల రామారావు, బలగ సూర్యనారాయణ, సీడి వెంకట రమణ, జమాన ఉదయ్ కుమార్, భైరి జగన్నాథం, జమాన అభినయ్, జమాన అరుణ కుమారి, భైరి దేవి, భైరి లీలా, కళ్లేపల్లి ఆదినారాయణ, సీడి పురుషోత్తం, దాసరి కిరణ్, సీడి దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.



ఎడిటోరియల్

# చర్చలను విఫలం చేసి...!

యుద్ధోన్మాది అమెరికా రంకెలు వేస్తున్నది. మరోసారి ఇరాన్ మీద విరుచుకుపడేందుకు, యావత్ ప్రపంచాన్ని ఇబ్బందుల పాల్జేసేందుకు పూనుకుంది. ఏ క్షణంలో అయినా దాడులు, ప్రతిదాడులు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. శనివారం నాడు ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలను ట్రంప్ యంత్రాంగం ఒక ప్రహసనంగా మార్చి వైఫల్య నెపాన్ని ఇరాన్‌పై నెట్టింది. ఒకవేళ మరోసారి ఇరాన్ చర్చలకు వచ్చినా తాను ఖాతరు చేయబోనని ఆదివారం రాత్రి ప్రకటించిన ట్రంప్ తన అసలు రూపాన్ని మరోమారు బయటపెట్టుకున్నాడు. చర్చలకు ముందే తమ యుద్ధ నౌకల్లో మారణాయుధాలను నింపుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండువారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించినప్పటికీ తన తొత్తు ఇజ్రాయిల్‌తో లెబనాన్‌పై దాడులను కొనసాగించింది. చర్చలను విఫలం చేసేందుకే ఇలా చేసింది. కాల్పుల విరమణ ఒప్పంద గడువు ఈ నెల 22వ తేదీ వరకు ఉన్నప్ప టికీ మనదేశ కాలమానం ప్రకారం సోమవారం రాత్రి ఏడున్నర (ఇరాన్‌లో 5.30) తరువాత హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం కోసం మిలిటరీని నడిపేం దుకు పూనుకున్నట్లు అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. రండి ఎలా చేస్తారో చూస్తామంటూ ఇరాన్ స్పందించింది. తమ రేవుల భద్రతకు విఘాతం కలిగిస్తే పర్షియన్ లేదా ఒమన్ గల్ఫ్‌లో ఉన్న ఇతర దేశాల రేవులను వేటినీ వదలబోమని ప్రకటించింది.

దాడుల గురించి ట్రంప్ ప్రకటన ప్రభావం చమురు మార్కెట్‌పై పడింది. ఇది రాసిన సమయానికి బ్రెంట్ రకం 103డాలర్లకు పెరిగింది. దాడులు, ప్రతిదాడులు కొనసాగితే 150 డాలర్ల వరకు పెరగవచ్చనే ఆందోళన వెల్లడైంది. అమెరికా చర్యను తాము సమర్ధించటం లేదని బ్రిటన్,ఆస్ట్రేలియా ప్రకటించి మరోసారి గాలితీశాయి. శాంతికోసం ప్రయత్నించాలన్న పోప్ లియో 14పై కూడా ట్రంప్ విరుచుకుపడటం కండకావరాన్ని వెల్లడించింది. యుద్ధం వద్దంటూ ఒక సాధారణ ప్రకటన చేశాను తప్ప ఎవరినీ పేరుపెట్టి చెప్పలేదని, అయినా అనుకున్నదాన్ని నిర్భయంగా చెబుతానంటూ స్పందించిన పోప్ రిపబ్లికన్ పార్టీ యంత్రాంగం బెదిరింపులకు లొంగేది లేదన్న సంకేతమిచ్చారని చెప్పాలి. ట్రంప్‌కు తన సందేశం అర్ధం కాలేదని, ట్రంప్ కంపునోట్లో నోరు పెట్టేందుకు తాను సిద్ధం కాదన్నట్లుగా ఎవరితో నూ వాగ్వాదానికి దిగదలుచుకొనేది లేదని కూడా పోప్ చెప్పటం హుందాతనాన్ని వెల్లడించింది. ట్రంప్ ఉన్మాదం చివరికి తనను తాను ఏసుక్రీస్తు మాదిరి పరిగణించుకొని గాయపడిన ఒక సైనికుడిని పరామర్శిస్తున్నట్లుగా కృత్రిమమేధతో తయారు చేసిన చిత్రాన్ని స్వయంగా సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు.తమ నేతలు దైవాంశ సంభూతులంటూ ఎవరైనా వీర భక్తులు వీధుల్లో వీరంగం, వంది మాగధులు స్తోత్రపాఠాలు వల్లించి ఉంటారేమో గానీ ఇలాంటి చౌకబారు పనులు బహుశా ఏ అమెరికా లేదా ఇతర దేశాధినేతలెవరూ చేసి ఉండరు.

నిజానికి హోర్ముజ్ జలసంధిని ఇరాన్ పూర్తిగా మూసివేయలేదు. తన మిత్రదేశాల నౌకల రవాణాను అనుమతిస్తున్నది, శత్రుదేశాల వాటి మీద ఆంక్షలు విధించింది. ఫలితంగా రోజుకు 150 నౌకలు తిరిగేవి మార్చినెల మొత్తంలో అంతే సంఖ్యలో రాకపోకలు సాగించాయి. ఆ జలసంధిలో ఇరాన్‌కు కప్పం గట్టి రాకపోకలు సాగిస్తున్న ఓడలను కూడా అడ్డుకుంటామని ప్రకటించిన ట్రంప్ కొద్ది రోజుల క్రితం తాము కూడా టెహరాన్‌తో కలసి పన్ను వసూలు చేస్తామని చెప్పిన మాటలను మరచిపోరాదు. ఇరాన్ ఆంక్షలను విమర్శించిన అమెరికా తానే రంగంలోకి దిగి ఏ ఓడనూ ఇరాన్ రేవుల్లోకి రాకపోకలకు అనుమతించేది లేదని ప్రకటించింది. ఇరాన్ నుంచి కొనుగోలు చేసిన చమురుతో ఉన్న ఓడలను ఇప్పుడు ట్రంప్ జిగినీ దోస్తు మన ప్రధాని నరేంద్రమోడీ ఎలా జలసంధిని దాటిస్తారో చూడాల్సి ఉంది. దీనికీ "అనుమతి"ని అడుక్కుంటారా లేక ఇప్పటికైనా చేస్తున్నది తప్పని ఖండించి ఆత్మగౌరవాన్ని నిలుపుకుంటారా !

ఇంతకాలం సదరు జలసంధితో తమకు పనిలేదని, ఎవరికి కావాలంటే వారు మాట్లాడుకొని నౌకలను విడిపించు కోవచ్చు, మా దగ్గర చమురు చాలా ఉంది, కావాలంటే అమ్ముతామని మాట్లాడిన ట్రంప్ ఇప్పుడు దిగ్బంధనానికి ఆకస్మికంగా ఎందుకు నిర్ణయించాడన్న చర్చ జరుగుతోంది. ఇరాన్ ఎగుమతి చేసే చమురులో ఎనభై శాతం వరకు చైనా దిగుమతి చేసుకుంటున్నది. అందువలన ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా ఇరాన్ రేవుల నుంచి ఆ ఓడలను అడ్డుకుంటే అటు చైనాను ఇటు ఇరాన్‌ను ఇరకాటంలో పెట్టవచ్చన్న ఎత్తుగడ స్పష్టంగా కనిపిస్తున్నది. బహుశా దానికి పూర్వరంగాన్ని సిద్ధం చేసేందుకే ఇరాన్‌కు చైనా ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు గతంలో కూడా చైనా ముందు ప్రదర్శించిన అమెరికాకు తలబొప్పి కట్టి దిగివచ్చిన సంగతి తెలిసిందే. అమెరికా ఉడుత ఊపులకు బెదిరేవారెవరూ లేరని, ప్రపంచం మీద తన పెత్తనం చెల్లదని వాషింగ్టన్ పెద్దలు ఎంత త్వరగా గ్రహిస్తే అంతమంచిది!




# ఇచ్ఛాపురంలో అగ్నిమాపక సిబ్బందికి నివాళి పరేడ్



- అగ్నిమాపక కేంద్రంలో స్మారక పరేడ్
- వీరమరణం పొందిన సిబ్బందికి నివాళులు
- అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం
- పాంప్లెట్ల పంపిణీ



**నవతరం-ఇచ్చాపురం**

స్థానిక అగ్నిమాపక కేంద్రంలో మంగళవారం స్మారక పరేడ్ కార్యక్రమాన్ని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.వి.కే. కాశీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ టౌన్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ పత్రి తవిటయ్య హాజరయ్యారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు.

అనంతరం ప్రజల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ ఫైర్ సర్వీస్ పాంప్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రిడేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలి

**నవతరం-శ్రీకాకుళం**

జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన అక్రిడేషన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు జిల్లా కలెక్టర్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

మంగళవారం ఉదయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన జయంతోత్సవ కార్యక్రమంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (×ఖీఔజీ) ప్రతినిధి బృందం మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎన్. ఈశ్వరరావు నేతృత్వంలో జిల్లా అక్రిడేషన్ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

వెంటనే స్పందించిన మంత్రి, జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే రాష్ట్ర కమిషనర్‌తో మాట్లాడి సమస్యను సులభంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ డబ్ల్యు జే రీజనల్ కన్వీనర్ ఎం.వి. మల్లేశ్వరరావు, యూజీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బుడుమూరు శ్రీరాములు నాయుడు, యూనియన్ ప్రతినిధులు బాబ్జి, జీవీ నాగభూషణ్, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్‌కు నివాళులు

నాయకత్వంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్కు ఘనంగా నివాళులర్పించారు.

మంగళవారం ఉదయం అంబేద్కర్ ఆడిటోరియంలో ఉన్న విగ్రహానికిజాతీయ కౌన్సిల్ సభ్యులు ఎన్. ఈశ్వరరావు, రీజనల్ కన్వీనర్ ఎం.వి. మల్లేశ్వరరావు పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను కొనియాడారు. సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఐఎఫ్ డబ్ల్యు జే ప్రతినిధి బృందం పెద్ద సంఖ్యలో పాల్గొంది.



# అంబేద్కర్ 135 జయంతి

## జేడియు రాష్ట్ర కార్యదర్శి కరణం తిరుపతి నాయుడు

**నవతరం - విజయనగరం**

అంబేద్కర్ 13వ జయంతి సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కు జేడీయూ రాష్ట్ర కార్యదర్శి కర్ణం తిరుపతి నాయుడు మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు పలువురు స్థానిక జేడీయూ నాయకులు ఉన్నారు.

# ఉచిత సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంజీఆర్



**నవతరం -పాతపట్నం**

నియోజకవర్గంలోని మెళియాపుట్టి మండల కేంద్రంలో ప్రధానమంత్రి ఎస్సీ, ఎస్టీ సూర్యఘర్ ఉచిత సోలార్ విద్యుత్ పథకాన్ని పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి రోజున ఎస్సీ,ఎస్టీ సహోదరులకు 200 యూనిట్ల మేర ఉచిత సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగానుందన్నారు. అలాగే పాతపట్నం నియోజకవర్గానికి 3,500 ఉచిత సోలార్ యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కొనియాడారు.

# తరాలు మారినా చెదరని స్ఫూర్తి అంబేద్కర్

మొదటిపేజీ తరువాయి

ఏర్పాట అవ్వడానికి ఆయన వేసిన పునాదులు, అమలు చేసే ప్రభుత్వాలు, చిత్తశుద్ధిగా ఉంటే అతి కొద్ది కాలంలోనే మనం సాధిస్తామని నమ్మకం మనందరికీ ఉంది.

కానీ ఇటీవల రాజ్యాంగ సవరణ చేసినప్పుడు చాలా ఆవేదన కలిగింది. చిన్న చిన్న అంశాలను రాజ్యాంగంలో సవరణ చేసినప్పుడు విశాలమైన ప్రజల ప్రయోజనం కోసం ఉండాలి. విశాలమైన దృక్పథం కలిగిన సందర్భంలోనే ప్రభుత్వాలు సవరణకు పూనుకోవాలి. కొద్దిమంది ప్రయోజనం కోసం ఆంధ్రప్రదేశ్లో ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం అందరినీ మోసగించడానికి ఒక సవరణ తీసుకురావడం చాలా బాధ కలిగించే అంశం అని మనవి చేస్తున్నాను. ఇదే విషయమై గత పత్రికా ప్రతినిధుల సమావేశంలో నా అభిప్రాయాన్ని తెలియజేశాను. రాజ్యాంగ సవరణ చేయాలంటే 160 కోట్ల ప్రజల ప్రయోజనం పొంది విధంగా ఉండాలి తప్ప కొద్ది మంది సంపన్నుల కోసం చేసే ప్రభుత్వాలు వారి మాటలను మన్నించే కేంద్ర ప్రభుత్వాలు అపఖ్యాతి పాలైపోతాయని నా అభిప్రాయం.

అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు మనం అనుసరిస్తున్న మార్గం సరైనదేనని నేను నమ్ముతున్నాను. ఈ రాష్ట్రంలో సమసమాజ నిర్మాణం కోసం జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు తు.చ.తప్పకుండా రాజ్యాంగం చెప్పినట్టుగా నడుస్తున్నాయని నా నమ్మకం. సమ సమాజం ఏర్పాటు అవ్వడానికి చదువు ముఖ్యమని, అందరికీ చదువు అందించాలని ప్రయత్నం చేశారు. అట్టడుగు ఉన్న వర్గాలన్నిటికీ కనీస సదుపాయాలు అందించేందుకు ప్రయత్నించారు.

ఈ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు రాష్ట్రానికి చెందిన సంపదను పంచాలని తద్వారా అభివృద్ధి చేయాలని అడుగులు వేశారు. ఏది ఇప్పుడున్న ఈ పాలకులకు ఆ..చిత్తశుద్ధి ఉందా ? ఆ..పరిస్థితి, ఆ..విశాల దృక్పథం ఈనాటి పాలకులకు లేదు. చాలా దురదృష్టకరం. ఇలాంటి విషయాలు మీద మనందరం పోరాటం చేయాల్సి ఉంది. అంబేద్కర్ ను గౌరవించడం అంటే సమ సమాజం ఏర్పాటు అయ్యేంత వరకూ, వివక్షతలన్నీ తొలగే వరకూ, నిరంతరం ప్రజల కోసం తోడుండే పార్టీలను అధికారంలో తెచ్చుకోవడం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకోవడం మనందరి ప్రథమ కర్తవ్యంగా ఉండాలి. అని మాజీ మంత్రి ధర్మాన పేర్కొన్నారు.

## రాజ్యాంగ రవికిరణం
# డాక్టర్ బిఆర్ అంబేద్కర్...

సంఘంలో సమానత్వం
విద్యా ద్వారానో సాధ్యం...

సమానత్వం కోసం
సమరానికి సిద్ధంకండి...

రాజ్యాధికారం కోసం
రక్తతర్పణ చేయండి....
పోరాడితే పోయేదేముంది చెప్పండి...
మీ బానిసత్వపుసంకెళ్ళు తెగడం తప్ప...
అన్నదే డా.బిఆర్ అంబేద్కర్ సందేశం..

ఔను వివక్షతల చిమ్మచీకటిని చీల్చే
సూర్యునిలా ఉదయించాడు అంబేద్కర్

చదువుల వెలుగుతో
అజ్ఞానపు సంకెళ్ళను
తెంచిన మార్గదర్శి మల్లయోధుడు...
మనుషులంతా ఒక్కటేనని
చాటిన సమతా మమతల
గగనమంత ఎత్తు...ఆయన ఆశయం...

అణిచివేతపై గర్జించిన అలుపెరగని
ఆత్మగౌరవ సింహం...డాక్టర్ అంబేద్కర్...
అంటరానితనమనే కారడవిని
నరికే గండ్రగొడ్డలిలా కదిలింది
కులమతాల గోడలను కూల్చే
విప్లవపు వజ్రాయుధంలా
మెరిసింది ఆయన చేతిలోని కలం...

సామాజిక న్యాయాన్ని కురిపించే
అమృతమేఘాలే ఆయన ఆలోచనలు...

భారత భాగ్యవిధాతగా నిలిచిన
అఖండ జ్ఞాన శిఖరం అంబేద్కర్...

చట్టసభల్లో బాధితుల గొంతుకై
రాజ్యాంగ విజయ దుందుభిని
మోగించాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్...
సమానత్వపు పూలు
పూయించే అక్షరాల వనం

అంబేద్కర్ కలలుగన్న నవ సమాజం...
అంబేద్కరుని అడుగుజాడ ఆలోచన నీడ
ఈ దేశానికి ఒక దిక్సూచి ఒక చైనా గోడ...

అంబేద్కర్ అందించిన ఆ స్ఫూర్తి ఆ దీప్తి
అణగారిన బ్రతుకుల్లో ఆరని ఆశాదీపమే
అంబేద్కర్ అంటే...
వివక్షతను నరికిన వజ్రాయుధం...

సమానత్వపు పూల తోట...
బడుగులకు బంగారు బాట...

విదేశాలలో ఆయన ఆర్జించిన
విజ్ఞానం రాజ్యాంగ నిధినదిలో
కురిసిన హక్కుల కుంభవర్షం...
అంబేద్కర్ అంటే...ఒక ఆశాకిరణం...
ఒక రవికిరణం అందరికీ వారే శరణం.



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# సెలెక్ట్ అయ్యారు




ఒక చిన్న గది... పాత టేబుల్... మీద చిందరవందరగా పడి ఉన్న పేపర్లు... అవన్నీ చూస్తేనే అర్థం అవుతోంది -- "చదివినా ఫలితం రావట్లేదు" అన్నట్టుగా ఉంది.
ఆ గదిలో రామ్ అనే కుర్రోడు కూర్చున్నడు. చదివిండు... పరీక్షలు రాసిండు... రిజల్ట్స్ కోసం ఎదురు చూసిండు... కానీ ప్రతి సారి ఒకటే మాట -- "మళ్లీ కాస్త తక్కువ మార్కులు"
ఆ రోజు గాలికి పేపర్లు అట్లా కదులుతున్నాయి. నోట్స్, ప్రశ్నపత్రాలు అన్నీ గందరగోళంగా పడున్నాయి.
రామ్ అన్నడు:
"ఏంది రా ఇది... నేనే చదివానా లేక ఇవే నన్ను పిచ్చోడ్ని చేస్తున్నాయా?"
అప్పుడే అతని అమ్మ గదిలోకి వచ్చి మెల్లగా చెప్పింది:
"పేపర్లు ఇట్లా గందరగోళంగా ఉన్నాయంటే... నీ మనసు కూడా అట్లానే ఉంది రా. ముందు మనసు సెట్ చేసుకో."
ఆ మాట విని రామ్ ఒక్కసారిగా ఆగిపోయిండు
తర్వాత మెల్లగా పేపర్లు సర్దడం మొదలుపెట్టిండు...
ప్రతి పేపర్ చూస్తూ అర్థం చేసుకుంటున్నడు -- "ఏక్కడ తప్పు జరిగింది?"
అప్పుడే అతనికి అర్థం అయ్యింది...
ప్రాబ్లమ్ చదువులో కాదు... పద్ధతిలో ఉంది రా.
ఆ రోజు నుంచి రామ్ స్టైల్ మార్చేశాడు... చదువు గందరగోళం కాదు... సిస్టమ్‌గా మార్చుకున్నడు.
కొన్ని నెలల తర్వాత... అదే టేబుల్ మీద ఒక లెటర్ వచ్చింది...
ఈసారి అది చూసి రామ్ కళ్ళు వెలిగిపోయాయి
"సెలెక్ట్ అయ్యారు"
రామ్ నవ్వేసిండు...
ముందు గందరగోళంగా ఉన్న పేపర్లు... ఇప్పుడు అతని సక్సెస్‌కు సాక్ష్యాలు అయ్యాయి.

రాసినోడు: తేరాల రాజేంద్రప్రసాద్ గుప్త
చరవాణి: 9297109223
బి.జె.ఆర్ నగర్, హైదరాబాద్ 500037
తెలంగాణ

# గూనపాలేంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా

- **33వ డివిజన్‌లో వేడుకలు**
- **శ్రీరామ మందిరం వద్ద కార్యక్రమం**
- **పెద్దలు, యువత, మహిళల పాల్గొనింపు**
- **అంబేడ్కర్‌కు నివాళులు**



**నవతరం-శ్రీకాకుళం**

33వ డివిజన్ పాత గూనపాలేం ప్రాంతంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామ మందిరం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వార్డు పెద్దలు, యువత, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సమానత్వం, విద్య, న్యాయం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని వార్డు సభ్యులు మరియు శ్రీరామ మందిరం కమిటీ సభ్యులు సంయుక్తంగా నిర్వహించారు.
కార్యక్రమంలో రాకోటి లక్ష్మణరావు, బలగ నాగభూషణం, శేషగిరి మాష్టారు, ఈ. సుజాత, పి. దానం చిన్నారి, డి. హరీష్ కుమార్, పి. రాజు, కె. రామరావు, ఎల్. భాను, శ్రీనివాస్, వినయ్ కుమార్, ఆర్. యశోద, ఉమామహేశ్వర్, రమేష్, బ్రమ్మం, ఎల్. కుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
జై భీమ్ నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది.



# మరో బిగ్ ఛాన్స్.. కనీసం ఈసారైనా కలిసొస్తుందా?

కృతి శెట్టికి తెలుగులో అన్నీ మంచి అవకాశాలే వచ్చాయి. కానీ అదృష్టం కలిసిరాలేదంతే. ఈసారి కూడా ఆమెను బిగ్ ఛాన్స్ వరించింది. మరి కనీసం ఇప్పుడైనా ఆమె క్లిక్ అవుతుందా?
వెంకటేశ్, కల్యాణ్ రామ్ హీరోలుగా మల్టీస్టారర్ సినిమా ప్లాన్ చేశాడు అనీల్ రావిపూడి. త్వరలోనే సెట్స్ పైకి రాబోతున్న ఈ సినిమాలో కల్యాణ్ రామ్ సరసన హీరోయిన్ గా కృతిశెట్టిని తీసుకున్నాడు. ఆ విషయాన్ని అతడే స్వయంగా నిన్న అధికారికంగా ప్రకటించాడు.
కనీసం ఈ సినిమానైనా కృతిశెట్టికి కలిసొస్తుందా అనే చర్చ మొదలైందిప్పుడు. గతంలో ఆమె తెలుగులో మంచి సినిమాలు చేసింది. శ్యామ్ సింగరాయ్ సినిమా క్రెడిట్ మొత్తం నాని, సాయిపల్లవి ఎగరేసుకుపోయారు. ది వారియర్, కస్టడీ సినిమాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. మనమే అంటూ చేసిన సినిమా డిజాస్టర్ అయింది. దీంతో ఆమె మెల్లగా మకాం మార్చింది. మలయాళం, తమిళ సినిమాలతో బిజీ అవుతోంది. ఇలాంటి టైమ్‌లో ఏరికోరి హిట్ మెషీన్ అనీల్ రావిపూడి ఆమెను తన సినిమాలోకి తీసుకున్నాడు. నిజంగా కృతి శెట్టి ఊహించని అవకాశం ఇది. ఈ సినిమా క్లిక్ అయితే, తెలుగులో ఆమె మరోసారి బిజీ అవ్వడం ఖాయం.
పైగా అనీల్ రావిపూడి సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు కూడా అంతోఇంతో వెయిట్ ఉంటుంది కాబట్టి, నటనాపరంగా కూడా కృతిశెట్టికి ఈ సినిమా కలిసొచ్చే అవకాశం ఉంది. ఇక మిగిలిందల్లా ఆమెకు కూసింత అదృష్టం కలిసిరావడమే.

# అంచనాలు సెట్ చేస్తున్నారా.. తగ్గిస్తున్నారా?




సినిమా విడుదలకు ముందు అంచనాలు పెంచడం కామన్. తమ సినిమా సూపర్ అని చెప్పుకోవడం యూనిట్ కర్తవ్యం. రిలీజ్ అయిన తర్వాత అసలు రంగు బయటపడుతుంది. అది వేరే విషయం. కానీ డెకాయిట్ విషయంలో అలా జరగడం లేదు.
టీజర్ తో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కానీ తాజాగా వచ్చిన ట్రయిలర్ ఆ స్థాయిని అందుకోలేకపోయింది. ఈ రెండింటి మధ్యలో కొన్ని సాంగ్స్ వచ్చినప్పటికీ ఏదీ వైరల్ కాలేకపోయింది. ఉన్నంతలో చిచ్చుబుడ్డి పాట కొంత బెటర్. అది కూడా పాటతో కాకుండా, శేష్ స్టెప్పులతో ఆకట్టుకుంది.
ఓవైపు ఇలా ఉంటే, మరోవైపు సినిమా యూనిట్ పదేపదే ఈ చిత్రాన్ని ఓ ప్రేమకథగా ప్రాజెక్ట్ చేసే ప్రయత్నం చేస్తోంది. అందరికీ ఆశ్చర్యం కలిగించే విషయం ఇదే. డెకాయిట్ కు ముందు నుంచి యాక్షన్ ఇమేజ్ ఉంది. ఆ ఇమేజ్ సినిమాకు మాస్ జనాల్ని తీసుకురావడానికి బాగా ఉపయోగపడుతుంది. కానీ యూనిట్ మాత్రం విడుదల తేదీ దగ్గరపడే కొద్దీ యాక్షన్ ఇమేజ్ నుంచి లవ్-రొమాంటిక్ ఇమేజ్ కు మారే ప్రయత్నం చేస్తోంది. అదే విచిత్రం. మొన్నటికిమొన్న నిర్మాత మాట్లాడుతూ తమ సినిమా మరో సీతారామం అనే కలరింగ్ ఇచ్చేలా మాట్లాడారు. ఆ తర్వాత హీరో మాట్లాడుతూ, తమ సినిమా ఓ అద్భుతమైన ప్రేమకథ అంటున్నాడు. పనిలోపనిగా తన ప్రేమకథలు కూడా వినిపిస్తున్నాడు. ఇదంతా చూస్తుంటే, అసలు డెకాయిట్ సినిమా యాక్షన్ మూవీనా, ప్రేమకథనా అనే కన్ఫ్యూజన్ లో పడిపోయాడు ప్రేక్షకుడు. దీన్ని కొనసాగిస్తూ, కుటుంబంతో కలిసి తమ సినిమాకు రావాలంటూ యూనిట్ నుంచి అదనంగా మరో స్టేట్ మెంట్.
డెకాయిట్ సినిమా ప్రచారమైతే జోరుగా సాగుతోంది కానీ, అంచనాల్ని సెట్ చేయడంలో ఈ గందరగోళం మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ అయోమయ స్థితిలోనే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ప్రస్తుతానికి టికెట్లు జోరుగా తెగుతున్నాయి. స్క్రీన్స్ అన్నీ ఓపెన్ అయిన తర్వాత సినిమాకు జనాల్లో ఎంత క్రేజ్ ఉంది.. అసలు కామన్ ఆడియన్స్ కు ఈ సినిమా ప్రచారం ఎంత రీచ్ అయిందనే విషయంపై ఓ ఐడియా వస్తుంది.

## జామియా మసీదు అభివృద్ధికి
# సోలార్ లైట్లు ఏర్పాటు

- 15 సోలార్ లైట్లు ఏర్పాటు
- బరేలి గ్రౌండ్‌లో వెలుతురు సౌకర్యం
- ఎమ్మెల్యే హామీ అమలు
- మసీదు కమిటీ కృతజ్ఞతలు



**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం జి.టి రోడ్డులోని జామియా మసీదు పరిసర ప్రాంత అభివృద్ధి పనుల్లో మరో ముందడుగు పడింది. మసీదు అనుబంధ బరేలి గ్రౌండ్‌లో 15 సోలార్ లైట్లు ఏర్పాటు చేసి పనులు పూర్తిచేశారు.
కొద్ది నెలల క్రితం మసీదు కమిటీ వినతులపై స్పందించిన స్థానిక ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీ మేరకు ఈ లైట్ల ఏర్పాటు జరిగింది.
అంతకుముందు కూడా గ్రౌండ్ శుభ్రపరిచే పనులు చేపట్టిన విషయం తెలిసిందే.
తాజాగా సోలార్ లైట్ల ఏర్పాటు పూర్తికావడంతో మసీదు పెద్దలు, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్యతో ప్రార్థనా స్థల పరిసరాల్లో సౌకర్యాలు మరింత మెరుగయ్యాయి.

## మునసబుపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి



**నవతరం-శ్రీకాకుళం**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు శ్రీకాకుళం రూరల్ మండలం, మునసబుపేట లో ఎస్సీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తండ్రి, మాజీ ఎంపీపీ గొండు జగన్నాథం ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఏ ఒక్కరికి సంబంధించి వ్యక్తి కాదని, అన్నివర్గాలకు చెందిన మహాశక్తి అని కొనియాడారు. చదువుతోనే ఏదైన సాధించగలమని చదువుకు అధిక ప్రాధాన్యత నిచ్చి మహానీయుడని అన్నారు. ఆయన అడుగు జాడల్లో యువత పయనించాలని ఆయన కోరారు. ఈయనతోపాటు ముడిదాన కృష్ణారావు, బలగ శ్రీరామ్మూర్తి, సబ్బీర్, ఎంపీటీసీ పంగ సత్యం, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలు
# ఘనంగా నిర్వహణ



**నవతరం-పొందూరు**

- విగ్రహానికి పాలాభిషేకం, పూలమాలలు
- జై భీమ్ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- సమానత్వం, విద్యపై నేతల సందేశం
- భారీగా పాల్గొన్న నాయకులు, ప్రజలు

పొందూరు మండలం బురిడికంచరాం గ్రామం, ఏచ్చెర్ల మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జై భీమ్ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు.
ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన విద్య, సమానత్వం, న్యాయం మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని, సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టెక్కలిలో ఘనంగా అంబేద్కర్
# జయంతి వేడుకలు





- పలు చోట్ల నివాళులర్పణ కార్యక్రమాలు
- అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు
- నాయకుల సందేశాలు
- భారీగా పాల్గొన్న ప్రజలు, కార్యకర్తలు



**నవతరం ప్రతినిధి టెక్కలి**

టెక్కలి మండల పరిధిలో పలు ప్రాంతాల్లో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
టెక్కలి అంబేద్కర్ జంక్షన్ వద్ద వైఎస్ఆర్ సీపీ ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.
అదేవిధంగా టెక్కలి ఆదిఆంధ్ర వీధి వద్ద సీపీఎం నాయకులు, అంబేద్కర్ ఆడిటోరియం వద్ద బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో కూడా వేడుకలు నిర్వహించారు. వివిధ చోట్ల అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.
కార్యక్రమాల్లో వైసీపీ, సీపీఎం, బీజేపీ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలు దేశానికి వెన్నుముక

### స్పాస్ సేవా సంఘం అధ్యక్షులు బూర్లె. పైడినాయుడు




**నవతరం-శ్రీకాకుళం**

అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా గరివిడిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్పాస్ సేవా సంఘం అధ్యక్షులు బూర్లె. పైడినాయుడు మాట్లాడుతూ అణగారిన వర్గాలను ఉన్నత స్థాయికి తీసుకురావడానికి మార్గం చూపిన మహనీయుడు, ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని గొప్ప రాజ్యాంగం రాసిన దార్శనికుడు బాబా సాహెబ్ అంబేద్కర్. అని భారత దేశంలో అభివృద్ధి అంబేద్కర్ సూచనల వలనే జరిగింది. దేశంలో అనేక మార్పులకి అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఎంతో ఉపయోగపడింది.అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి పదవిలో అబ్దుల్ కలాం, రాంనాథ్ కోవింద్, ద్రౌపది ముర్ము లాంటి గొప్ప వ్యక్తులు రావడం అంబేద్కర్ చలవేనని,అంబేద్కర్ మనకి అందించిన రాజ్యాంగం వల్లే నేటికి స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు, ఉద్యోగాలు, ప్రజల ముందుకు వస్తున్నాయని అమెరికా, జర్మనీ, రష్యా దేశాల్లో అంబేద్కర్ విగ్రహాలు నెలకొల్పి అక్కడ విద్యార్థులకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగ విలువలను బోధిస్తున్నారని, అది అంబేద్కర్ తో పాటు రాజ్యాంగం గొప్పతనమని అన్నారు.

## అంబేద్కర్ జయంతి
# సందర్భంగా ఘన నివాళులు

- అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు
- కాంగ్రెస్ నాయకుల పాల్గొనింపు
- రాజ్యాంగంపై ప్రసంగాలు
- నేతలకు సన్మానం

**నవతరం-శ్రీకాకుళం**



డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఘనంగా నివాళులు అర్పించారు.
డీసీసీ అధ్యక్షులు సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు స్వేచ్ఛాయుత జీవనానికి పునాది అని పేర్కొన్నారు. అంబేద్కర్ వంటి మహానుభావుడు దేశానికి దక్కడం భారత ప్రజల అదృష్టమని కొనియాడారు. కార్యక్రమంలో రెల్ల సురేష్, కెవిఎల్ఎస్ ఈశ్వరి, కొత్తకోట్ల సింహాద్రి నాయుడు, బస్వా షణ్ముఖరావు, కొత్తకోట్ల లక్ష్మి, బొచ్చు కృష్ణవేణి, గొల్లపల్లి దాలయ్య, గుంట బారిక అప్పారావు, జి. రామారావు, ఎం. లక్ష్మి, జి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు రాజేష్‌కు మాజీ మంత్రి ధర్మాన పరామర్శ

**నవతరం-శ్రీకాకుళం**



జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆంధ్రజ్యోతి సబ్ ఎడిటర్ , న్యాయవాది తాడి రాజేష్‌ను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన చికిత్స పొందుతున్న మెడికవర్ ఆసుపత్రికి చేరుకుని రాజేష్ ఆర్యోగ్య పరిస్థితిపై వైద్య బృందంతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్యం ఆగేందుకు వీల్లేదని, ఇటువంటి నిబద్ధత ఉన్న జర్నలిస్టులు సమాజానికి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన విషయం తెలిసినప్పటి నుంచి వైద్యులతో మాజీ మంత్రి ధర్మాన ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. బాధ్యత ఉన్న జర్నలిజం చేసే రాజేష్ వంటి వారంటే తనకు ప్రత్యేక అభిమానముందని వారి కుటుంబ సభ్యులతో అన్నారు. ఎప్పటికిప్పుడు రాజేష్‌కు మెరుగైన వైద్యమందించే విషయమై వైద్య బృందం తగు శ్రద్ధ తీసుకోవాలని మాజీ మంత్రి ధర్మాన కోరారు. వారి కుటుంబానికి ఏ అవసరం వచ్చినా అండగానుంటానని మాజీ మంత్రి ధర్మాన అన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**